# సాక్షి
## వికారాబాద్

సోమవారం : 10 : జూన్ : 2024






**కొందరికే గృహజ్యోతి!**

ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా మార్చి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తోంది.

2లో▸



**అలరించిన బైక్ ర్యాలీ**

ఆదివారం నిర్వహించిన జాతీయ చాంపియన్ బైక్ రేసింగ్ ర్యాలీ పలువురిని అలరించింది.

2లో▸



**ఒకే టీచర్!**

తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత సమస్య విద్యార్థికారులకు ఇబ్బందిగా మారింది.

3లో▸

## న్యూస్‌రీల్

### గ్రూప్–1 పరీక్ష రాసి వస్తుండగా విషాదం

**బైక్‌పై నుంచి పడి అచ్యుతాపూర్ పంచాయతీ కార్యదర్శి దుర్మరణం**



సుమిత్రబాయి(ఫైల్)

ధారూరు: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరైన జూనియర్ పంచాయతీ కార్యదర్శి తిరుగుప్రయాణంలో దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మండల పరిధిలోని తాండూరు–హైదరాబాద్ ప్రధాన మార్గంలో గట్టెపల్లి బస్‌స్టేజీ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ధారూరు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. బొంరాస్‌పేట మండలం బొట్లోనితండా పంచాయతీ పరిధిలోని దేవులానాయక్ తండాకు చెందిన బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నెహ్రూనాయక్‌కు, దుద్యాల మండలం ఈర్లపల్లి తండాకు చెందిన సుమిత్రాబాయి(29)తో మూడేళ్ల క్రితం వివాహమైంది. సుమిత్రాబాయి యాలాల మండలం అచ్యుతాపూర్ జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తోంది. వీరిద్దరూ ప్రిలిమినరీ పరీక్ష రాసి తండాకు తిరిగి వెళ్తున్నారు. ధారూరు మండలం గట్టెపల్లి సమీపంలో వర్షం కురుస్తుండడంతో సుమిత్రబాయి గొడుగు తెరిచి పట్టుకుంది. ఈ క్రమంలో బలమైన ఈదురుగాలులు వీయడంతో గొడుగు గాలికి ఉల్టా అవ్వడంతో బైక్ అదుపుతప్పింది. సుమిత్రాబాయి కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్**



మాట్లాడుతున్న వేణుగోపాల్

కొడంగల్: ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఎస్టీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రకటించిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పాఠశాల ప్రారంభం నాటికే స్కావెంజర్లను నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రకటించాలన్నారు. ప్రభుత్వ బడులకు ఉచితంగా విద్యుత్ సరఫరా, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఎమ్‌టీఎస్ ప్రకటించాలని కోరారు. ప్రస్తుతం బదిలీలు, పదోన్నతుల్లో ప్రతీ ఒక్కరికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ, రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యులు పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దయాకర్, ఆశప్ప, గోపాల్, లక్ష్మీనారాయణ, అంజిలయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని ఓ సెంటర్‌లో పరీక్ష సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# ప్రిలిమ్స్ ప్రశాంతం

**నిమిషం నిబంధన అమలు**
- ఆలస్యంగా వచ్చిన వారికి నో ఎంట్రీ
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఎస్పీ

అనంతగిరి: గ్రూప్–1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. వికారాబాద్‌లో ఏడు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో 10 గంటల తర్వాత వచ్చిన వారిని అధికారులు అనుమతించకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. పరీక్ష ఉదయం 10.30గంటల నుంచి నుంచి ఒంటి గంటవరకు కొనసాగింది. అభ్యర్థులను గేట్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. వికారాబాద్‌లోని సెంటర్‌లలో దాదాపు 30మందికి పైగా అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించలేదు.

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

పట్టణంలోని సాయి డెంటల్ కళాశాల, ఎస్‌ఏపీ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వికారాబాద్‌లో ఏడు, తాండూరులో నాలుగు, పరిగిలో రెండు చొప్పున జిల్లాలో మొత్తం 13 సెంటర్లలో 5,468 అభ్యర్థులకు కేటాయించగా 4,277 మంది పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. 1,191 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని చెప్పారు.



నిర్వాహకులకు సూచనలిస్తున్న రాహుల్‌శర్మ

| | |
|---|---|
| పరీక్ష కేంద్రాలు: | 13 |
| మొత్తం అభ్యర్థులు: | 5,468 |
| హాజరైనవారు: | 4,277 |
| గైర్హాజరైనవారు: | 1,191 |

**అధికారుల సమక్షంలో పేపర్ల తరలింపు**

జిల్లాలో విశ్వభారతి డిగ్రీ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సెంటర్లను అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించారు. పరీక్షల నిర్వహణ కోసం ఉదయం అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూం ఓపెన్ చేసి పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించామన్నారు. ఆయన వెంట ఆర్డీఓ వాసుచంద్ర, కలెక్టరేట్ ఏఓ అమరేంద్ర కృష్ణ, సంబంధిత అధికారులున్నారు. ఎస్పీ కోటిరెడ్డి వికారాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తును, పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.



అభ్యర్థులను తనిఖీ చేసి లోనికి అనుమతిస్తున్న సిబ్బంది



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

# భారీ వర్షం.. రైతన్న హర్షం



ధారూరులో కురుస్తున్న వర్షం

- పొంగిన వాగులు.. వంకలు
- చెరువుల్లోకి చేరుతున్న వరద నీరు
- విత్తనాలు విత్తేందుకు దుక్కులు సిద్ధం చేసుకున్న అన్నదాతలు

ధారూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణం వేడిగా ఉండటంతో రైతులు విత్తనాలు విత్తేందుకు అదను దాటిపోతుందేమోనని ఆందోళన చెందారు. మధ్యాహ్నం కురిసిన వర్షంతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు సమకూర్చుకున్న రైతులు సోమవారం నుంచి విత్తనాలు వేసే పనుల్లో బిజీ కానున్నారు. ఈ వానాకాలంలో రైతులు పత్తి, కంది, మొక్కజొన్న, పుసుపు, పెసర, మినుము, వరి తదితర పంటలను సాగుచేయనున్నారు. మండలంలో దాదాపు 28 వేల ఎకరాల్లో విత్తనాలను వేయనున్నారు.

**పత్తి విత్తనాల ధరలకు రెక్కలు**

విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఇప్పటికే ప్రభుత్వం సూచించినా వ్యాపారులు మాత్రం రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో ఒక్కో ప్యాకెట్‌ను రూ.1,800 నుంచి రూ.2వేల వరకు విక్రయించారని చింతకుంట గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**యాలాలలో జోరు వాన**

యాలాల: మండల పరిధిలో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఏకధాటిగా సాయంత్రం వరకు కురిసింది. దీంతో మండల పరిధిలోని వాగులు, చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో కాగ్నా, కాకరవేణి నదిలోకి వరద వచ్చి చేరుతుంది. ఏకధాటి వర్షానికి పలువురు పనులను వాయిదా వేసుకున్నారు.



యాలాల: లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో..

# గ్రామాల అభివృద్ధికి సహకరించండి

కద్తాల్: ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులు వారి గ్రామాల లభివృద్ధికి చేయూత నివ్వాలని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఆటా 2024 వేడుకల్లో భాగంగా రెండోరోజు పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించినట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరినట్లు చెప్పారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జడ్చర్ల, దేవరకద్ర, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి తదితరులు హాజరైనట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి, ప్రతినిధులు భరత్, నర్సింహారెడ్డి, సాయి, సుభాష్ రామకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నట్లు వెల్లడించారు.



ఉమ్మడి పాలమూరు ప్రవాస భారతీయులు

# ‘ఉపాధి’ని కాపాడుకుందాం

**వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య**

షాద్‌నగర్‌రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నెలకొన్న సమస్యల సాధనకోసం భవిష్యత్‌లో పోరాటాలను చేపడతామని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అన్నారు. ‘ఉపాధిహామీ పథకంలో నెలకొన్న సమస్యలు–పరిష్కార మార్గాలు’ అంశంపై పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అనేక సమస్యలు నెలకొన్నాయని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి సరైన నిధులను కేటాయించడం లేదని విమర్శించారు. ఉపాధిహామీ పథకంలో పనికి తగిన వేతనాలను ఇవ్వకపోవడం, కూలీలకు పనిముట్లను అందజేయడంలేదన్నారు. ఉపాధిహామీ పథకాన్ని రోజురోజుకూ నిర్వీర్యం చేస్తూ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. నిరుపేదల కడుపు నింపుతున్న ఈ పథకాన్ని రక్షించుకోవాలనే ఆలోచనతో జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సదస్సుకు ఉపాధిహామీ పథకం విశ్రాంత అసిస్టెంట్ పీడీ సామెల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. సదస్సుకు ఉపాధిహామీ కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుద్దుల జంగయ్య, డివిజన్ ప్రధానకార్యదర్శి రమేషయాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం జిల్లా మాజీ నాయకుడు వెంకటేశ్, నాయకులు కృష్ణ, యాదగిరి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

# జంట హత్యలు బాధాకరం

- విచారణ వేగవంతం చేయాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఐపీఎస్ మాజీ అధికారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- బాధిత కుటుంబాలకు పరామర్శ

కద్తాల్: నాలుగు రోజుల క్రితం కద్తాల్ సమీపంలో జరిగిన జంట హత్య కేసులో వేగంగా విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఐపీఎస్ మాజీ అధికారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గోవిందాయిపల్లికి చెందిన శేషుగారి శివ, గుండెమోని శివగౌడ్ ఇటీవల దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం గోవిందాయిపల్లిలో బాధిత కుటుంబాలను మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్‌తో కలిసి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన యువకులు హత్యకు గురికావడం బాధాకరమని అన్నారు. కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉండే చేతికొచ్చిన బిడ్డలు హత్యకు గురికావడం, ఆయా కుటుంబాలను దిక్కుతోచని స్థితిలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశాడు. హత్యల వెనుక నయీం ముఠా మాజీ సభ్యుల పాత్ర కూడా ఉందని గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. ప్రశాంత వాతావరణంతో కూడిన ఈ ప్రాంతంలో ఇలాంటి హత్యలు జరగడం దారుణమని ఖండించారు. నిందితుల కాల్‌డేటా రికార్డును పరిశీలించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ట్రయల్‌పూర్తి చేసి, యావజ్జీవ కారగార శిక్షపడేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని బాధితుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీస్‌యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, జ్యోతయ్య, తులసీరాంనాయక్, గణేశ్, ఎంగలి రఘు, స్థానిక నాయకులు ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

# పర్యావరణ ప్రాముఖ్యతను తెలిపేందుకే నేచర్ క్యాంప్‌లు

**ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్**

మొయినాబాద్: పిల్లలకు వివిధ రకాల చెట్లు, పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేయడానికే నేచర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ అన్నారు. మొయినాబాద్ మండలం చిలుకూరు ఫారెస్ట్ ట్రాక్ పార్కులో ఎకో టూరిజం కార్యక్రమాల్లో భాగంగా వాన్డేరింగ్ బీ హాలిడేస్ ఆర్గనైజేషన్ సహకారంతో నేచర్ క్యాంపు నిర్వహించారు. శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు జరిగిన క్యాంపులో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 24 మంది పాల్గొన్నారు. నేచర్ క్యాంపునకు వచ్చిన పిల్లలకు వివిధ రకాల చెట్లను చూపించి వాటి ఉపయోగాలను వివరించారు. హైకింగ్, టీం బిల్డింగ్, టెంట్ ఫిక్సింగ్ (గుడారాలు), నైట్ ట్రెక్కింగ్, క్యాంపుఫైర్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం బర్డ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పక్షులను చూపించి వాటి గురించి వివరించారు. అడ్వెంచర్‌లో భాగంగా రివర్ క్రాసింగ్, వాల్ క్రాసింగ్, క్లైంబింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో ప్రతి వారం నేచర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్దపీట వేసి (మద్యం నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ కళ్యాణపు సుమన్, వాండేరింగ్ బీ సంస్థ ప్రతినిధి రాఘువేంద్రప్రసాద్, బోటనిస్ట్ వీరకిషోర్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, నేచురలిస్ట్ శ్రీకాంత్, అడ్వెంచర్ ట్రైనర్స్ సతీష్, మధు, రాకేష్, బాబు, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



నేచర్ క్యాంపులో గుడారాలు వేస్తున్న పిల్లలు

## క్లుప్తంగా

### ఖర్గేను కలిసిన టీఆర్ఆర్



పరిగి: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గెను ఆదివారం ఢిల్లీలోని ఖర్గె నివాసంలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా ప్రజలకు అందిస్తున్న సంక్షేమాల గురించి ఖర్గె అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను ప్రజలకు సక్రమంగా అందేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని రాజకీయ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉండి ప్రజా సేవచేయాలని సూచించారు.

### ఇంటి పైకప్పు కూలి వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న యాదగిరి

తాండూరు టౌన్ : ఇంటి పైకప్పు కూలి వ్యక్తికి గాయాలయిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలో కిరాయికి నివాసం ఉంటున్న కోటబాస్పల్లి యాదగిరి వర్షాకాలం రావడంతో బండలతో కప్పి ఉన్న ఇంటి పైకప్పును సరి చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కూలడంతో ఆయన బండల కింద ఇరుక్కుపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని బయటకు తీశారు. రెండు కాళ్లు, తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

### మాధవరెడ్డికి ఆహ్వానం



మాధవరెడ్డి

అనంతగిరి: దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణస్వీకారోత్సవానికి వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డికి ప్రత్యేక ఆహ్వానం అందింది. దీంతో ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాణస్వీకారోత్సవంఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం పంపడం గొప్ప విషయంగా భావిస్తున్నానన్నారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

మర్పల్లి: మండలంలోని పంచలింగాల గ్రామంలో ఆదివారం మద్విరాట్ పోతులూరి వీరబ్రంహ్మేంద్రస్వామి ఆలయ రెండవ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిపారు. ఉ.7 గంట నుంచి ఆలయంలో రుద్రాభిశేకం, గణపతిపూజ, హోమం, గోవిందమ్మ, వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కనుల పండువగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాలలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### పాముకాటుకు విద్యార్థిని మృతి



పూజ (ఫైల్)

తాండూరు రూరల్: పాముకాటుతో ఓ ఇంటర్ విద్యార్థిని మృతి చెందిన ఘటన తాండూరు మండల పరిధిలోని ఓగిపూర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం అల్లాకోట్‌కు చెందిన ఎడెల్లి రవి, కుటుంబ సభ్యులతో కలిసి ఓగిపూర్ సమీపంలోని నాపరాతి క్వారీల వద్ద నివాసముంటున్నారు. అక్కడే పాలిషింగ్ యూనిట్‌లో కార్మికుడిగా పని చేస్తున్నారు. రవి కూతురు పూజ(16), జినుగుర్తి సమీపంలోని ఓ హాస్టల్లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతోంది.సెలవులు ఉండటంతో తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. శనివారం రాత్రి 1 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న పూజ కుడికాలును పాము కాటేసింది. వెంటనే పూజ అరవడంతో తల్లిదండ్రులు లేచి చూడగా పాము కనిపించింది. పూజను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పూజ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కొందరికే గృహజ్యోతి!

- మండలంలో ఇటు హర్షం... అటు ఆందోళన
- సాంకేతిక కారణాలతో పలువురికి అందని పథకం

దౌల్తాబాద్: ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా మార్చి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తుంది. మండలంలో పలు కుటుంబాలు ఈ పథకంలో లబ్ధి పొందుతున్నాయి. కొన్ని కుటుంబాలకు వర్తించకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

**200 యూనిట్లు ఉచితం**

గతంలో 200 యూనిట్ల విద్యుత్ వాడుకున్న వినియోగదారులకు రూ.900 విద్యుత్ బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేయడంతో ఇంటి అవసరాలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి ప్రభుత్వం బిల్లులు మాఫీ చేస్తుంది.

**లబ్ధిపొందని కుటుంబాలు**

తెల్లరేషన్‌కార్డు దారుడు ఒక మీటర్ మీద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతాడు. వినియోగదారుడు ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులో తప్పనిసరిగా మీటరు యూనిక్ సర్వీస్ నంబర్‌ను( యూఎస్ఐడీ) జత చేయాలి. కొంతమంది వినియోగదారులు తప్పుగా వేయడంతో వారికి పథకం వర్తించలేదు. దీంతో పథకం అమలుకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. యూనిక్ సర్వీసు నంబరు, తెల్లరేషన్‌కార్డు నంబరు, ఆధార్‌కార్డు నంబర్‌తో తిరిగి ఆన్‌లైన్ చేయడంతో సమస్య కొంత పరిష్కారమవుతుంది. మండలంలో 9వేలకు పైగా కనెక్షన్లలో సుమారు వెయ్యి వరకు లబ్ధిదారులకు మేలు జరుగుతోంది.



జీరో బిల్లు అందిస్తున్న అధికారులు (ఫైల్)

**పథకం అమలు కాలేదు**



గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్నా.. నాకు ఫ్రీ బిల్లు అమలు కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గృహజ్యోతి పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– కృష్ణ, దౌల్తాబాద్

**అర్హులకు వర్తిస్తుంది..**

గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్నా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం అమలు అవుతుంది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి జీరో బిల్లు వస్తుంది. అర్హులైన ప్రతి ఒక్కరికి వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటాం

– మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్

## సాంకేతిక లోపమా.. తప్పిదమా!



ఈరప్ప హస్నాబాద్, గ్రామం

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ఇన్నాళ్లు పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉండటంతో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో ఆదివారం మండలంలోని హస్నాబాద్‌లో విద్యుత్ బిల్లులు అందించారు. చాలా మందికి జీరో బిల్లు రావడంతో ఆనందపడ్డారు. అయితే గ్రామానికి చెందిన చెట్టుకింది ఈరప్పకు గృహజ్యోతి అమలు కాకపోవడంతో ఆందోళన చెందాడు. కాలనీలో అందరికీ జీరో బిల్లు రావడం తనకు వర్తించకపోవడంతో, ప్రభుత్వం అందరికీ ఒకేలాగా పథకం అమలు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ సురేశ్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా దుద్యాల్ మండలంలో 4800 సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయని, 75శాతం మాత్రమే అమలు అయ్యాయన్నారు. మిగతా 25శాతం కనెక్షన్లు ఒకే రేషన్‌కార్డుకు రెండు సర్వీస్ కనెక్షన్లు ఉన్నటువంటివి, ఇతర సాంకేతిక కారణాల వల్ల ఆయా సర్వీస్ కనెక్షన్లు నమోదు కాలేదని వివరించారు. అన్ని అర్హతలు ఉన్న వారు ఎలాంటి ఆందోళన చెందకుండా సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# రవాణా మార్గంతోనే అభివృద్ధి



రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్‌రూరల్: గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం సక్రమంగా ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతజాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బీటీ రోడ్డు నిర్మాణం పనులను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని పాత జాతీయ రహదారిని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పట్టణంలోని ముఖ్యకూడలి నుంచి అనూస్ పరిశ్రమ జంక్షన్ వరకు రూ. 45కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ పనులను చేపట్టడం జరిగిందని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులలో నాణ్యతను పాటించి నిర్మాణం పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్అలీఖాన్‌బాబర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లాశ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, చెన్నయ్య, జమ్మద్‌ఖాన్, కృష్ణవేణి, రాజేందర్‌రెడ్డి, రాయికల్‌శ్రీనివాస్, యాదగిరియాదవ్, సర్వర్‌పాష, శ్రీశైలం గౌడ్, ఆశన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బద్రి




సమావేశంలో పాల్గొన్న బద్రి తదితరులు

తుర్కయంజాల్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌సెట్టింగ్ సిమెంట్ ఫైవ్‌స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ బద్రి తెలిపారు. ఆదివారం మహలక్ష్మి సిమెంట్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీమేస్త్రిలతో సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తి అవుతుందని తెలియజేశారు. ఈ సిమెంట్‌తో ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపికయిందని చెప్పారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతీ సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. అనంతరం డీలర్ శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే దీని ధర రూ.20 అధికంగా ఉంటుందని అయినప్పటికీ నాణ్యత బాగుటుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ అధికారి సాహెర్, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న అవార్డుకు శ్రీశైలంగౌడ్



అవార్డు అందుకుంటున్న శ్రీశైలంగౌడ్

మొయినాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న జాతీయ అవార్డు 2024కు రంగారెడ్డి జిల్లా కల్లు వృత్తిదారుల చైర్మన్ తాళ్ల శ్రీశైలంగౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ చైర్మన్ నల్లారాధాకృష్ణ, రాష్ట్ర సెలక్టెడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ శ్రీశైలంగౌడ్‌కు అవార్డు, నియామక పత్రం అందజేశారు. శ్రీశైలంగౌడ్ గత 40 సంవత్సరాలుగా కల్లు గీత వృత్తిదారుల సమస్యలపై పోరాటం చేస్తూ జిల్లా వ్యాప్తంగా కల్లు వృత్తిదారులకు లైసెన్స్‌లు లేని చోట టీఎస్‌టీటీసీఎస్ ఇప్పించారు. గీత కార్మికుల సమస్యలపై ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. జూన్ 10న మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించే బహుజన రైటర్స్ 4వ సమావేశంలో అవార్డు, సన్మానం నిర్వహించేందుకు ఆహ్వానించినట్లు చెప్పారు. ముఖ్యంగా జూన్ 10న తన జన్మదినం కావడం జాతీయ అవార్డు పురస్కారం సన్మానం జరగడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పేదల అభ్యున్నతికి, సమాజసేవలో మరింత కృషి చేస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని పేర్కొన్నారు.

### జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి



రోహిత్‌రెడ్డి(ఫైల్)

శంకర్‌పల్లి: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శంకర్‌పల్లి విద్యార్థి రోహిత్‌రెడ్డి సత్తాచాటాడు. మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంకి చెందిన మర్రి అంజిరెడ్డి, వరలక్ష్మి దంపతుల కుమారుడు రోహిత్‌రెడ్డి.ఈయన కూకట్‌పల్లి శ్రీచైతన్య కళాశాలలో ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్నాడు. ఇంజనీరింగ్‌పై ఆసక్తి ఉన్న రోహిత్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయగా.. 2672 ర్యాంకు సాధించాడు. కుమారుడు మంచి ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## అలరించిన బైక్ రేసింగ్



మోమిన్‌పేటలో బైక్ రేసింగ్‌లో రైడర్



మాజీ సర్పంచ్ రాజశేఖర్‌తో విజేతలు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని మల్లారెడ్డి గూడెం, గోవిందాపూర్ గ్రామాల్లోని కొండలు, గుట్టల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ చాంపియన్ బైక్ రేసింగ్ ర్యాలీ పలువురిని అలరించింది. ఎఫ్ఎంఎస్‌సీఐ ర్యాలీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ ర్యాలీ చాంపియన్ షిప్ 2డబ్ల్యూయూ -2024లో 67మంది వివిధ రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించి బైక్ రేసింగ్‌లో పాల్గొన్నారు. మూడు విడతలుగా పాల్గొన్న రైడర్లు అక్కడికి వచ్చిన వారిని అలరించారు. 20 కిలో మీటర్ల దూరం ను 17నిమిషాల 38 సెకనులలో చేధించిన రేసర్ రాజేందర్‌కు మొదటి బహుమతిగా కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అరవింద్, మాజీ సర్పంచు రాజశేఖర్, ఆర్గనైజరు సత్యా పాల్గొన్నారు.

## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మాద్గుల: మండలంలోని కొలుకులపల్లిలో ఆదివారం సాయంత్రం తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడు ఉడతల వెంకటయ్యగౌడ్(53), మృతి చెందాడు. రోజు మాదిరిగానే కల్లు గీయడానికి వెంకటయ్య గౌడ్ తాటిచెట్టు పైకి ఎక్కాడు. అయితే, ప్రమాదవశాత్తు వెంకటయ్యగౌడ్ తాటిచెట్టుపై నుంచి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలియడంతో ఎంపీటీబట్టు కిషన్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని గీత కార్మికుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఘటన పై పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెలే సబితా ఇంద్రారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆర్యవైశ్యులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఎస్‌వైఆర్ కన్వెన్షన్‌లో జరిగిన మీర్‌పేట కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తన గెలుపు కోసం కృషి చేసిన ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. పేద విద్యార్థులను గుర్తించి వారి చదువుల కోసం సంఘం ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. అలాగే, సమాజంలో వెనుకబడిన వారికి ఆర్యవైశ్యులు సహాయం చేసే శక్తిని వాసవీమాత అమ్మవారు ఇవ్వాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ఉప్పల్‌లో సంఘానికి కొంత స్థలాన్ని కేటాయించారని, ఈ స్థలంలో భవనం నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వంతో మాట్లాడి చొరవ తీసుకుంటానని చెప్పారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా మంచన ప్రేమ్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌గప్తా, కోశాధికారిగా శ్యాంప్రసాద్ గుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంచన శుభకుమార్‌గుప్తాతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, సంఘం రాజకీయ కమిటీ చైర్మన్ రవికుమార్ గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, శ్రీరామచంద్రమూర్తి గుప్తా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియచేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొంది రెండవసారి కేంద్రమంత్రిగా ఎన్నికైన కిషన్‌రెడ్డిని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలబొకెను అందజేసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలన కొనసాగుతుందని అన్నారు. కేంద్రంలో మంత్రి పదవులను చేపట్టేందుకు రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎన్నిక కావడం హర్షనీయమని అన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నర్సింహ్మాగౌడ్, వంశీకృష్ణ, వెంకటేశ్, మఠంరుషికేష్ తదితరులు ఉన్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

యాచారం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్మిద్ద గ్రామానికి చెందిన మడ్డి వెంకటయ్య ఇబ్రహీంపట్నంలో తన బంధువుల ఇంట్లో శుభకార్యం కుటుంబ సభ్యులతో శనివారం సాయంత్రం వెళ్లాడు. తిరిగి ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం విరగ్గొట్టి కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న 80 తులాల వెండి, అర తులం బంగారం, రూ. 5 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# రైతన్నా.. జర భద్రం!

- పిడుగు పాటును ముందే తెలుసుకోవచ్చు
- పలు యాప్‌లను తీసుకువచ్చిన కేంద్రం
- వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం
- రైతులకు ఉపయుక్తం



మరియాపురం గ్రామంలో పిడుగుపడి కాలిపోతున్న కొబ్బరి చెటు (ఫైల్)



సంకెపల్లిగూడ వద్ద పిడుగు పడి వ్యక్తి మృతి (ఫైల్)

షాబాద్: పిడుగులు, వర్షాలే ప్రధానంగా రైతులకు తీరని నష్టం కలిగిస్తాయి. ఎప్పుడు ఎక్కడా పిడుగులు పడతాయో.. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి. వీటివల్ల మనుషులు, మూగజీవాలు మరణించిన ఘటనలు అనేకం. గతంలో షాబాద్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రైతుల ఆవులు, గొర్రెలు పిడుగు పాటుకు గురై మృతి చెందాయి. ఏటా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 5న సంకెపల్లిగూడ వద్ద పిడుగు పడి రైతు మృతి చెందిన ఘటన పాఠకులకు తెలిసిందే. మరియాపురం గ్రామంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి చెట్టు కాలిపోయింది. ప్రతి ఏటా ఇలాంటి అనేకం సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అండగా నిలిచేందుకు కేంద్రం పలు యాప్‌లను భారత వాతావరణ శాఖ ద్వారా తీసుకువచ్చింది. ఇంటర్‌నెట్ ద్వారా వాటిని డౌన్ చేసుకుంటే పిడుగు, వర్షం ఎప్పుడు పడుతుందో ఇట్టే తెలిసిపోతుంది. తదనుగుణంగా రైతన్న వ్యవహరిస్తే చాలు, యాప్‌లతో మరో ఐదు రోజుల వరకు వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలుసుకునే వీలు కల్పించింది.

**రెయిన్ అలారం**

గూగుల్ ప్లే స్టోర్ నుంచి రెయిన్ అలారం అని ఇంగ్లిష్‌లో టైప్ చేస్తే ఈ యాప్ కనిపిస్తుంది. కేవలం ఒక నిమిషంలో డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు అతను ఉన్న ప్రాంతానికి సమీపంలోని 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో.. క్షణాల్లో సమాచారం అందిస్తుంది. దీంతో వర్షం ముప్పు తెలుసుకొని, ముందే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది.

**దామినీ యాప్**

సాధారణంగా వర్షాకాలంతో పాటు ఏప్రిల్, మే నెల్లో పిడుగులు పడటం సహజం. వ్యవసాయ పనుల హడావుడిలో ఉండే రైతులు పిడుగు పడే సమయంలో దగ్గరలోని ఎత్తయిన చెట్ల కిందకో, మరో చోటుకో వెళ్తుంటారు. అవి అంత సురక్షితం కావని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులను అప్రమత్తం చేసేదే దామినీ యాప్. దీనిని కూడా గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇది సమీపంలోని 20 కిలో మీటర్ల దూరంలో 5 నుంచి 20 నిమిషాల్లో ఎక్కడ పిడుగు పడుతుందో అప్రమత్తం చేస్తుంది. దీనివల్ల సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చు. పంట చేలకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా వరి కోతల సందర్భంలో రైతులకు నష్టం చేసేవి వర్షాలే. దాన్ని తప్పించేందుకు భారత వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌కు రూపకల్పన చేసింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే తాజా సమాచారాన్ని అందిస్తుంది. రాబోయే 5రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలు సహా ఆకాశం మేఘావృత మవుతుందా లేదా గాలులు ఏ మేరకు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏ దిశగా వీస్తాయో తెలుపుతుంది.

**విడివిడిగా డౌన్‌లోడ్**

ప్లే స్టోర్ నుంచి మూడు యాప్‌కు విడివిడిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతీ యాప్‌కు వినియోగదారుడి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే సరైన సమాచారాన్ని సకాలంలో అందిస్తాయి.